


ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి : ఆర్డీవో

కరీంనగర్ టౌన్, మార్చి 22: వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో మహేశ్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పోలింగ్ బూత్ వరకు నడక అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, మైన్స్ ఏడీ రామాచారి, మెప్మా పీడీ రవీందర్‌తో కలిసి పోలింగ్ బూత్ నడక చేపట్టారు. నగరంలోని పోలింగ్ స్టేషన్ 321, 322కు మహిళా సంఘాల సభ్యులు, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ అనిత, సీవో దీప, ఆర్‌పీలు కలిసి ఓటుపై అవగాహన కల్పించారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, మార్చి 22: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ పరిశ్రమలు, విద్యాసంస్థల్లో వారధి సొసైటీ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఏర్పాటుచేసిన వారధి సొసైటీ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అనేక పరిశ్రమలు, విద్యాసంస్థలతో పాటు ఐటీ టవర్ ఉన్నాయని, పరిశ్రమల జనరల్ మేనేజర్, వారధి సొసైటీ కలిసి నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించేందుకు దృష్టిసారించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ప్రైవేట్ ఉద్యోగాలపై యువత దృష్టిసారించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని, వారికి సమగ్ర శిక్షణ అందించాలని, ఉద్యోగాలు సాధించేలా కృషిచేయాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం మరోచోట లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మౌళిక వసతులు ఉన్న ప్రభుత్వ భవనంలో ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మూడునెలలపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగ నియామకాలను చేపట్టేందుకు జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ చైర్మన్లుగా, కన్వీనర్‌గా జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సారధ్యంలో ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ జి.ఆంజనేయులు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఈవో జనార్ధన్‌రావు, డిఐసీ జీఎం నవీన్‌కుమార్, మెప్మా పీడీ రవీందర్, డీఆర్‌డీవో శ్రీధర్, ఎస్సీ డెవలప్‌మెంట్ డీడీ నతానియల్, బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అనిల్ ప్రకాశ్‌కిరణ్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ దేవేందర్‌రావు, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వడ్డీ మాఫీ'కి భారీ స్పందన

- ఆస్తిపన్ను బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్
- అధికారులు, ఉద్యోగులు మూకుమ్మడి ఒత్తిడి
- 31తో ముగియనున్న గడువు



కరీంనగర్ టౌన్, మార్చి 22: ఆస్తిపన్ను బకాయిలను ఏక మొత్తంలో చెల్లించిన వారికి వడ్డీలో 90శాతం మాఫీ పథకాన్ని అమలు చేయడంతో నగరపాలక సంస్థలో పలువురు వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకొని పన్నులు చెల్లిస్తున్నారు. దీనితో ఇటు నగరపాలక సంస్థకు ఆదాయం సమకురుతుండగా, పన్నుచెల్లింపుదారులకు వడ్డీపై 90శాతం మాఫీ చేస్తుండడంతో ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతోంది. మార్చి 31వ తేదీ వరకు ఆస్తిపన్ను బకాయిలపై ఉన్న వడ్డీలో 90శాతం మాఫీ చేస్తుండడంతో ఏకమొత్తంలో పన్నులు చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటూ నగరపాలక సంస్థ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. అంతేకాకుండా సంవత్సరాల తరబడి ఆస్తిపన్ను చెల్లించని మొండి బకాయిలను వసూలు చేయాలనే లక్ష్యంతో నగరపాలక సంస్థ కమిషనర్ బి.శ్రీనివాస్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారు. దీంతో వడ్డీ మాఫీ పథకానికి చక్కటి స్పందన లభిస్తోంది. ఏళ్ల తరబడి ఆస్తిపన్నులను చెల్లించని వారి వద్దకు బిల్‌కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారి ఆంజనేయులుతో కలిసి అదనపు కమిషనర్ స్వరూపరాణి, కమిషనర్ బి.శ్రీనివాస్ మూకుమ్మడిగా వెళ్లి బకాయిలపై వేసిన వడ్డీలో 90శాతం మాఫీ ఉన్నందున పన్నులను ఏకమొత్తంలో చెల్లించాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులు జారీ చేస్తున్నారు. 31 మార్చిలోగా ఆస్తిపన్ను బకాయిలు చెల్లించని పక్షంలో వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందని, చెల్లించని పక్షంలో మున్సిపల్ చట్ట ప్రకారంగా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, ప్రైవేట్, వాణిజ్య, వ్యాపార, గృహవినియోగదారులకు హెచ్చరిస్తున్నారు. దీనితో బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

90శాతం వడ్డీమాఫీని సద్వినియోగం చేసుకోండి

- కమిషనర్ బి.శ్రీనివాస్

ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిలను ఏకకాలంలో చెల్లిస్తే 90శాతం వడ్డీ మాఫీ ఈ నెల 31వ తేదీ వరకు అమలులో ఉంటుంది. ఈ అవకాశాన్ని నగర ప్రజలు, వ్యాపారులు, వివిధ సంస్థల నిర్వాహకులు, వివిధశాఖల అధికారులు పన్నులు చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించాలి. ఈ నెల 31వ తేదీ తర్వాత వడ్డీతో సహా పన్నుల బకాయిలను చెల్లించాల్సి ఉంటుంది. పన్నులు చెల్లించకుంటే మున్సిపల్ చట్ట ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటాం. పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలి.

పెన్షనర్స్ భవన్‌కు సంబంధించిన ఆస్తిపన్ను 24 సంవత్సరాల నుంచి చెల్లించక పోవడంతో వడ్డీతో కలిపి రూ. 9,11,503 కాగా 90శాతం వడ్డీ మాఫీతో చెల్లించాలంటూ ఒత్తిడి చేయడంతో 5,71,761 వడ్డీ మాఫీ కాగా 3,39,742 రూపాయలను చెల్లించారు. విద్యుత్‌శాఖకు చెందిన రూ. 8 లక్షల బకాయిలను ఇటీవల ఓటీఎస్ కింద చెల్లించగా శుక్రవారం ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపునకు సంబంధించిన ఆస్తిపన్నుబకాయిల నుంచి 90శాతం వడ్డీ మాఫీ చేయడంతో రూ. 86 లక్షల 7వేల 972 రూపాయల చెక్కును అందజేశారు. అలాగే చాలా మంది వాణిజ్య, వ్యాపార సంస్థలు, గృహాలకు సంబంధించిన మొండి బకాయిలను కూడా వడ్డీ మాఫీతో చెల్లిస్తున్నారు. నగరపాలక సంస్థకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో కలిపి రూ.42.68 కోట్ల ఆస్తిపన్నులు వసూలు కావాల్సి ఉండగా ఓటీఎస్, స్పెషల్ డ్రైవ్‌తో ఇప్పటి వరకు 28.79 లక్షల రూపాయలు వసూలు చేశారు. శుక్రవారం ఒక్క రోజు రూ. 21.58 లక్షలు ప్రైవేట్ వ్యక్తుల నుంచి, ఆర్టీసీ నుంచి 86.07 లక్షల పన్ను బకాయిలను వసూలు చేశారు. ఓటీఎస్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలోనే కోటి 50 లక్షల మేరకు ప్రభుత్వశాఖలకు సంబంధించిన పన్నుబకాయిలను వసూలు చేశారు. ఆస్తిపన్ను వసూళ్లలో నూరుశాతం లక్ష్యంగా పెట్టుకొని మొండి బకాయిలను వసూలు చేస్తున్నప్పటికీ కోర్టు కేసులు, వివాదాలు, ఇతరత్రా కారణాలతో పన్ను చెల్లించే వారు లేక ప్రైవేట్ బకాయిలు 10శాతం మేరకు, నిధులు లేవనే కారణంతో వివిధ ప్రభుత్వశాఖలకు సంబంధించిన ఆస్తిపన్ను బకాయిలు కూడా వసూలు కాక పోవడంతో 80శాతం మాత్రమే వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతో పోల్చితే ఆస్తిపన్ను వసూళ్లలో కరీంనగర్ నగరపాలక సంస్థ ముందు వరుసలో నిలిచిందని అధికారులు తెలిపారు.



ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపు ఆస్తిపన్ను బకాయిల చెక్కును ఆర్టీసీ అధికారి నుంచి స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భూగర్భ జలాలను కాపాడుకోవాలి

కరీంనగర్ కల్చరల్, మార్చి 22: వర్షాకాలంలో వృధాగా పోయే వాననీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకిపోయే విధంగా చర్యలు తీసుకుంటే భూగర్భ జలాలను కాపాడుకోవచ్చని, వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూసుకోవచ్చని మానేరు పర్యావరణ సమితి వ్యవస్థాపకుడు తోట లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం లయోలా కళాశాల ప్రాంగణంలో ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రపంచంలోని పలు ప్రదేశాల్లో నీటి కొరత ఏర్పడుతుందని, శాశ్వతంగా ఈ సమస్య పరిష్కారానికి ప్రతి ఇంటా ఇంకుడు గుంత, ప్రతి గ్రామంలో వాగులు ప్రవహించే దిశలో అడ్డంగా రాతి కట్టడాలు, చెక్‌డ్యాంలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అన్నాహజారే చేపట్టిన వాటర్‌షెడ్ పథకాలను ఆదర్శంగా తీసుకొని బీడు భూముల్ని పచ్చని పంట పొలాలుగా మార్చుకోవచ్చని అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రంలోని శాస్త్రవేత్త డాక్టర్ జి ఉష మాట్లాడుతూ వ్యవవసాయదారులు తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించే విధానాలు అమలు చేస్తే నీటి వినియోగం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అలెక్స్, వైస్ ప్రిన్సిపాల్ సాంబశివరావు, పెద్ది లక్ష్మీనారాయణ, గంజి స్వరాజ్‌బాబు, సామ నారాయణ, గాదె నీలకంఠం, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల్లో అధికారుల తనిఖీ



శంకరపట్నం మండలం తాడికల్‌లో రిజిష్టర్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఇంజనీర్ హారిక

శంకరపట్నం, మార్చి 22: శంకరపట్నం మండలంలోని తాడికల్, వంకాయగూడెం, మొలంగూర్ గ్రామపంచాయతీలను విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఇంజనీర్ హారిక శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామపంచాయతీలో నీటి సరఫరాకు సంబంధించి సెవెన్, క్లోరినేషన్, ట్యాంక్ క్లీనింగ్, కొత్త నల్లా కనెక్షన్, గ్రీవెన్స్, బ్లీచింగ్ పౌడర్ స్టాక్, పైపులైన్ లీకేజీల మరమ్మతుల రిజిస్టర్లను పరిశీలించారు. కార్యదర్శులకు రిజిస్టర్ల నిర్వహణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఏఈ విజయకుమార్, మిషన్ భగీరథ ఏఈ మొగులయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడులు



సదస్సులో మాట్లాడుతున్న ఇండోనేషియా శాస్త్రవేత్త విజయన్

మానకొండూర్, మార్చి 22 : ఆయిల్ పామ్ పంటల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఇండోనేషియా శాస్త్రవేత్త విజయన్ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో శుక్రవారం తెలంగాణ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంటల సాగుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనువుగా ఉన్న డెలి, లామే రకం వృద్ధి చేయబడి లోహియా కంపెనీ ఆధ్వర్యంలో దేశంలోని రైతులకు దిగుమతి చేయడం జరుగుతుందన్నారు. ఈ రకం మొక్కలు నీటి ఎద్దడిని తట్టుకోవడమే కాకుండా అధిక దిగుబడినిచ్చే మేలు రకం పొట్టి విత్తనం అన్నారు. ప్రతి మూడు నుంచి నాలుగు నెలలకొకసారి సిరాడ్ పామ్ ఎలిట్ బృందం పంటలను పరిశీలించడం జరుగుతుందన్నారు. గత 30 ఏళ్లుగా దేశంలో గోల్డ్ డ్రాప్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజులలో రైతులందరికీ ఉత్తమ సేవలు అందిస్తూ పంటను తామే కొనుగోలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో సిద్ధాంత్ లోహియా, స్థానిక ఎఫ్‌పివో ఛైర్మన్ పాఖాల పురుషోత్తంరెడ్డి, కంపెనీ సాంకేతిక సలహాదారు వైఎస్ రంగనాయకులు, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, కేవికే జమ్మికుంట శాస్త్రవేత్త వేణుగోపాల్, జిల్లా రీజినల్ మేనేజర్ విజయ్ భరత్, సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



మధ్యాహ్నం నిర్మానుష్యంగా తెలంగాణ చౌక్


పెరిగిన ఉష్ణోగ్రతలు

- మధ్యాహ్నం వేళలో రోడ్లు నిర్మానుష్యం

తుఫాను ప్రభావంతో గత నాలుగు రోజుల నుంచి వాతావరణం చల్లబడటంతో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందారు. రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో మధ్యాహ్నం వేళలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. శుక్రవారం భానుడు ప్రతాపం చూపడంతో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన జనం ఇబ్బందులు పడ్డారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్





మద్యం డిపోల్లో బీరు కొరత



- వేసవి ప్రారంభంలోనే పెరిగిన వినియోగం
- తగ్గిన ఉత్పత్తి.. లైసెన్సీల్లో ఆందోళన

కరీంనగర్ క్రైం, మార్చి 22 : వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లకు మద్యం సరఫరా చేసే డిపోలో బీరుతోపాటు కొన్ని కంపెనీల విస్కీకి కొరత ఏర్పడింది. దీంతో వైన్, బార్ షాపులకు రోజువారీగా సరఫరా చేస్తున్నారు. వేసవి కాలంలో బీరు అమ్మకాలు 3 నుంచి 4 రెట్లు ఎక్కువగా ఉంటాయి. మద్యం వ్యాపారులు వేసవి ముందుగానే బీర్‌పెట్టెలు అధికమొత్తంలో కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకుంటారు. వేసవి ప్రారంభం కావడంతో గతంలో తెచ్చుకున్న స్టాక్ అయిపోవడంతో తగినంత బీరు సరఫరా లేక మద్యం వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లిక్కర్ తయారీ కంపెనీల నుంచి ప్రభుత్వం వివిధ బ్రాండెడ్‌ల మద్యం కొనుగోలు చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే మద్యం డిపోలకు సరఫరా చేస్తుంది. అక్కడి నుంచి మద్యం రిటైల్ షాపులకు సరఫరా అవుతుంది. అయితే పలు లిక్కర్ తయారీ కంపెనీలు సరఫరా చేసిన మద్యంకు ప్రభుత్వ బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కొన్ని డిస్టిల్లరీస్, బ్రేవరీస్‌లు మద్యం ఉత్పత్తిని తగ్గించినట్లు సమాచారం.

జిల్లాలో వేసవి కాలంలో మార్చి నుంచి మే వరకు రోజుకు 2 కోట్ల వరకు బీరు అమ్మకాలు జరుగుతుంటాయి. ఒక్కో మద్యం షాపులో రోజుకు 60 నుంచి 70 పెట్టెల వరకు బీరు విక్రయాలు జరుగుతుండగా ప్రస్తుతం మద్యం డిపో నుంచి రోజుకు 20 నుంచి 30 పెట్టెల బీరు మాత్రమే సరఫరా చేస్తున్నారని మద్యం వ్యాపారులు చెబుతున్నారు. మద్యం డిపోకు రోజుకు 10 నుంచి 15 లారీల బీరు వస్తున్నదని, ఆ బీరును అన్ని రిటైల్ మద్యం షాపులకు సమానంగా రేషన్‌పై సరఫరా చేస్తున్నామని మద్యం డిపో మేనేజర్ రవికుమార్ తెలిపారు.

ధర్మారంలో రోడ్డు ప్రమాదం

● ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, మార్చి 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో బైక్‌పై కూర్చున్న వ్యక్తిని మరో వాహన దారుడు ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. దీంతో వీరిని సిరిసిల్ల ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో పనిచేస్తున్న వలస కూలి రాంబాబు ధర్మారం గ్రామంలోని ఆన్‌లైన్ సెంటర్ వద్ద ఆగి ఉన్న బైక్‌పై కూర్చున్నాడు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తూ ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడిపోయారు. వారికి తీవ్ర గాయాలు కావడంతో సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

బ్రహ్మోత్సవాలకు పెరిగిన రద్దీ

- గోదావరి నదిలో పుణ్య స్నానాలు - రాత్రి స్వామి వారల సేవ ఊరేగింపు



పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్న స్వామి వారల సేవలు

ధర్మపురి, మార్చి 22: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ పెరిగింది. లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి, అ నుబంధ ఆ లయాలకు చేరుకున్నారు. అనంతరం వెంట తెచ్చుకున్న కట్న కానుకలు, అమ్మ వారలకు ఒడి బియ్యం సమర్పించారు. కోడె మొక్కులు, వల్లు బండ వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం పక్షాన దాతల సహకారంతో సుమారు 7 వేల మంది భక్తులకు అన్న దానం చేశారు. ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పర్యవేక్షణలో కమిటీ సభ్యులు సేవలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, సీఐ రాంనర్సిం హారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రంగ శం కరయ్య, సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, ఇనుగంటి వేంకటేశ్వర్‌రావు, గునిశెట్టి రవీందర్, సత్తయ్య, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు

సర్వ దేవతా హోమం..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహిం చారు. ఆలయ ఆలయ వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలతో పాటు సర్వ దేవతా, శాంతి హోమాలు నిర్వహించారు.

స్వామి వారల సేవ ఊరేగింపు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాత్రి వేళలో శ్రీ స్వామి లక్ష్మీ నరసింహస్వామి వారల సేవలను అశ్వ వాహనంపై ఊరేగించారు.



మొక్కులు చెల్లించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

స్వామి వారల సేవలు పుర వీధుల గుండా ఇసుక స్తంభంవద్దకు తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దారి పొడవుగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి దర్శనం చేసుకున్నారు. తిరిగి స్వామి వారల సేవలను ఆలయానికి తీసుక వెళ్లారు. కాగా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి రెండో రూ 4,16,455 ఆదాయం లభించినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో స్వామి వారల వివిధ రకాల పూజల టికెట్ల విక్రయం ద్వారా 2,29,216, ప్రసాదాలు విక్రయం ద్వారా రూ 1,23,000 లభించగా, అన్న దానం కోసం భక్తులు, దాతల ద్వారా సేకరించిన రూ 64,439 విరాళాలు ఉన్నట్లు ఆయన వివరించారు

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఊరేగింపు సేవ ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్థానిక శేషప్ప కళావేదికపై రాత్రి ఉషాగాయత్రి కూచిపూడి నృత్యప్రదర్శన ఉంటుందని, రాత్రి 7-30 గంటల నుంచి భక్తి సంగీత విభావరి, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని ఈవో తెలిపారు.



ధర్మపురి గోదావరి నది వద్ద భక్తుల సందడి

ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి



ధర్మపురి శేషప్ప కళావేదికపై కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని శేషప్ప కళా వేదికపై శుక్రవారం రాత్రి కళాకారులచే నిర్వహించిన భక్తి సంగీతం భక్తులను ఆకట్టుకుంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శేషప్ప కళావేదికపై స్థానిక కళాకారులు జి శంకర్‌శర్మ, ఎస్ రామకిష్టయ్య, కె విశ్వనాథం, పి చంద్రమౌళి, జె నర్సయ్య, కె. శంకర్, కె దత్తాత్రి పాడిన భక్తి సంగీత పాటలు ఆకట్టుకున్నాయి. అలాగే గర్షకుర్తికి చెందిన శశికళ, రాజమల్లయ్య బృందంచే భక్తి సంగీత విభావరి, మంచిర్యాల నందిని నృత్యాలయంచే కూచిపూరి నృత్య ప్రదర్శన అలరించింది. హైదరాబాద్ సరస్వతి సంగీత నృత్య శిక్షణాలయం ప్రతిమ శశిధర్‌చే భక్తి సంగీత విభావరి అలరించింది. కళాకారులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ శాలువా కప్పి సన్మానించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జిగా ఎస్ఎల్ఎన్ నాట్యమండలి కార్యదర్శి కొరిడె నరహరి, పక్క వాద్య కళాకారులుగా రామయ్యశర్మ (కీబోర్డు), ఎస్ వేణుగోపాల్ (మృదంగం), రమేశ్ (తబలా), శ్రీధర్ (కీబోర్డు), రాజేశం (మృదంగం, తబలా, మోర్‌సింగ్), సుదర్శనా చార్యులు (మృదంగం), రవీందర్ (ఫ్లూట్), సంతోష్ (మృదంగం), ప్రవీణ్ (కీబోర్డు), అరుణ్ (తబల) వ్యవహరించారు.

మహిళ దారుణ హత్య

● రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అనంతనగర్‌లో ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న టౌన్ సీఐ రఘుపతి

సిరిసిల్ల క్రైం, మార్చి 22: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అనంతనగర్‌లో మహిళ దారుణ హత్యకు గురైంది. శుక్రవారం వెలుగు చూసిన ఘటన వివరాలను సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి వెల్లడించారు. బీహార్‌కు చెందిన ఆరుగురు కార్మికులు సిరిసిల్ల పట్టణంలోని అనంతనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తున్నారు. మూడు రోజులుగా ఆ ఇంటి తలుపులు తెరవడం లేదు. గది నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంటి తాళం పగలగొట్టి చూడగా రక్తపు మడుగులో మహిళ మృతదేహం పడి ఉంది. తల వెనుక భాగంలో పదునైన ఆయుదంతో దాడి చేశారు. మృతదేహాన్ని పరిశీలించి న పోలీ సులు వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన అలకుంట రమ (41)గా గుర్తించారు. కొడుముంజకు చెందిన రమ భర్త రాజయ్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. భవన నిర్మాణ పనుల కోసం ప్రతీ రోజు కొడుముంజ నుంచి సిరిసిల్ల లేబర్ అడ్డాకు వచ్చి కూలీ పనికి వెళ్తుంది. ఇదే క్రమంలో బీహార్‌కు చెందిన కార్మికులతో పరిచయం ఏర్పడినట్లు, వారితో పనికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అద్దె ఇంటికి తీసుకెళ్లిన కార్మికులు మద్యం తాగి ఆమెపై అత్యాచారం చేసేందుకు యత్నించగా ఎదురు తిరగడంతో హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల శుక్రవారం కొనసాగింది. యాసంగి పంట సాగునీటి కో సం ఎస్సారెస్పీ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 3,500 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం డ్యామ్‌లో 18.715 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 5,396 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇందులో కాకతీయ కాలువకు 3,500, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, అల్లిసాగర్ ఎత్తిపోతల పథకా నికి 347 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 146 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 231 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

క్రీడలతో స్నేహ సంబంధాలు

మానకొండూర్, మార్చి 22: క్రీడలు యువత మధ్య స్నేహ సంబంధాలు పెంచుతాయని మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ 17వ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 40 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు బొట్ల కిషన్, మాజీ ఉపసర్పంచు మూగల మహేందర్‌రెడ్డి, నిర్వాహకులు పాఖాల శంకర్, గ్రామస్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పుస్తెల తాడు అపహరణ




గాలిస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

వెల్గటూర్, మార్చి 22: మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారు జామున ఓ వృద్ధురాలి మెడలో నుంచి దుండగుడు పుస్తెల తాడు అపహరించిన సంఘటన కలకలం రేపింది. బాధితురాలు గుమ్ముల నర్సమ్మ తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారు జామున కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరు బయటికి వెళ్లింది. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన దుండగుడు ఆమె మెడలోని పుస్తెల తాడు అపహరించడానికి ప్రయత్నించాడు. ఈ సంఘటనతో తేరుకున్న వృద్ధురాలు ఆ దుండగుడితో కాసేపు పెనుగులాడింది. ఈ క్రమంలో పెస్తెల తాడు తెగిపో యింది. రెండు తులాల పుస్తెల తాడు లాక్కొని దుండగుడు పరార య్యాడు. తెల్లవారు జాము కావడంతో ఎవరూ బయట లేకపోవడంతో అరిచినప్పటికీ లాభం లేకపోయింది. ముఖానికి దస్తీ కట్టుకోవడం దానికి తోడు చీకటిగా ఉండడంతో దుండగుని ముఖం గుర్తించలేదని వృద్ధురాలు రోదిస్తూ చెప్పింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఉమాసాగర్ డాగ్ స్క్వాడ్ బృందంతో గాలింపు చేపట్టారు.

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్‌పై విద్యార్థులకు అవగాహన

కరీంనగర్ టౌన్, మార్చి 22: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కార్ఖానగడ్డ)లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం వినియోగదారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అంబురాథోడ్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) సభ్యులు జయశ్రీ, ఫోరం జిల్లా అధ్యక్షుడు జీవన్ పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వస్తువులు, ఉత్పత్తులు, ఆహారం, నీరు, తూనికలు, కల్తీ వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బీఐఎస్ అవగాహనపై పరీక్ష నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి విజేతలకు 1000,750,500,250 రూపాయల నగదు బహుమతు లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ సత్యనారాయణ చారి, ఉపాధ్యాయురాలు త్రివేణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బతో రైతు మృతి



జగన్(ఫైల్)

మానకొండూర్, మార్చి 22: మండలంలోని పెద్దూరుపల్లి గ్రామంలో పంది జగన్(55) అనే రైతు శుక్రవారం వడదెబ్బతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన పంది జగన్ అనే రైతు తన రెండు ఎకరాల పొలంలో ఆడ మగ వరి పంటను సాగు చేస్తున్నాడు. రెండు మూడు రోజులుగా తన పొలంలో వరిని దులుపుతున్నాడు. అందులో బాగంగా శుక్రవారం కటుంబ సభ్యులతో దులుపుతుండగా అస్వస్థతకు గురి అయ్యాడు. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వడదెబ్బతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి22: ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి 30రోజుల పాటు ఫొటో గ్రఫీ అండ్ వీడియో, ఏప్రిల్ 18నుంచి సీసీటీవీ ఇనస్టాలేషన్ అండ్ సర్వీసింగ్‌లో పురుషులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల అభ్య ర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9949448157, 9849411002 నంబర్లలో సంప్రదించాలని సంస్థ డైరెక్టర్ తెలిపారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జగిత్యాల టౌన్, మార్చి 22: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీరయ్య గుడి ప్రాంతంలో ఉన్న ఓ ఇంటిలో చోరీ జరిగింది. బీరయ్య గుడి ప్రాంతానికి చెందిన రాజేశం రెండు రోజుల క్రితం ఎండపెల్లి మండల కేంద్రానికి కుటుంబంతో వెళ్లారు. గురువారం రాత్రి ఇంటికి తిరిగి చేరుకున్న రాజేశం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ అయినట్లు గుర్తించారు. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారంతో పాటు రూ. 10 వేల నగదును అపహరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కమాన్‌పూర్, మార్చి 22 : మండలంలోని గుండారం గ్రామంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కాశెట్టి సతీష్(38) గుండారం గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. ఈక్రమంలో తెల్లవారుజామున తన స్వగ్రామానికి వచ్చేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి మహిళ..

ఇల్లందకుంట, మార్చి 22: మండలంలోని సీతంపేట గ్రామంలో మతిస్థిమితం లేని జోరుక రమ (40) అనే మహిళ వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రమకు మూడు నెలలుగా మతి స్థిమితం కోల్పోయింది. గురువారం తన సొంత గ్రామమైన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లి గ్రామం నుంచి తమ బంధువులైన సీతంపేట గ్రామానికి వచ్చి తిరిగి పర్లపల్లి వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయింది. శుక్రవారం సీతంపేట గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. మృతురాలి భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజకుమార్ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని రైతు దుర్మరణం

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన చందుపట్ల లక్ష్మారెడ్డి (45) అనే రైతు శుక్రవారం రాత్రి దుర్మరణం పాలయ్యాడు. లక్ష్మారెడ్డి గొల్లపల్లి నుంచి తన భార్య, సమీప బంధువుతో కలిసి ఎల్లారెడ్డిపేట వైపు బైక్‌పై వస్తుండగా డీవైడర్‌ను ఢీకట్టి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడిక్కడే మృతిచెందాడు. లక్ష్మారెడ్డి రెండు సంవత్సరాల క్రితం విదేశాల నుంచి వచ్చి వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య రేణుక, బంధువుకు గాయాలు కావడంతో స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

హుజూరాబాద్, మార్చి 22: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన గంట కుమారస్వామి (26) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమారస్వామి ఆరు నెలల నుంచి మద్యానికి బానిసై ఇంట్లో తరుచూ భార్యతో గొడవపడేవాడు. గొడవలు, మద్యం మానలేక మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో రేకుల షెడ్డు ఇనుప పైపుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్యతో పాటు ఒక కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి గంట సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 22: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వ్యక్తులకు శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ మూడు రోజులు జైలుశిక్ష లేదా రూ.5,500లు జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. 10 మంది వాహనదారులను కోర్టులో హాజరుపరచగా మరో ఏడుగురు వ్యక్తులకు 11,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

ఒకరికి జైలు శిక్ష

కోల్‌సిటీ, మార్చి 22: రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన సిద్దేశ్వర్ తల్వార్ అనే వ్యక్తికి శుక్రవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ఎదుట హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ 3రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన ఏఎస్ఐ అంత్యక్రియలు

కరీంనగర్ క్రైం/తిమ్మాపూర్, మార్చి 22 : కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో పనిచేస్తున్న ఏఎస్ఐ గురువారం మరణించగా అంత్రక్రియలు శుక్రవారం నిర్వహించారు. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో నిర్వహించిన ఏఎస్ఐ కిషన్ అంత్యక్రియల్లో కరీంనగర్ అడిషనల్ డీసీపీ(ఏఆర్) అనోక్‌జైన్ పాల్గొన్నారు. కిషన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన అడిషనల్ డీసీపీ వారి కుటుంబానికి ఎళ్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చొప్పదండి, మార్చి 22: చొప్పదండి శివారులోని కాకతీయ కాలువ డి86 డిస్ట్రిబ్యూటర్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. కాలువకు సంబంధించిన లస్కర్ కనుకయ్య శుక్రవారం మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారాన్ని అందించాడు. సంఘటన స్థలానికి ఎస్సై ఉపేంద్రచారీ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 30 నుంచి 40 ఏండ్ల వయస్సు గల మహిళ మృతదేహంగా భావిస్తున్నారు. మృతదేహం బాగా కుళ్లిన స్థితిలో ఉందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకుర్తి, మార్చి22: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడినగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామి తెలిపారు. కుంటాల కొండయ్య అనేవ్యక్తి పెద్దకుమారుడు విజయ్‌కుమార్ మానసిక రుగ్మతతో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈనెల 17న మోతాదుకు మించి మందులు వేసుకోగా, కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని, కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గోదావరిలో పడి పశువుల కాపరి మృతి

మల్లాపూర్, మార్చి, 22 : మండలంలోని వాలొండ గ్రామ శివారులోని ప్రమాదవశాత్తు గోదావరిలో పడి పశువుల కాపరి పుట్ట గంగరాం(55) నీట మునిగి మృతి చెందినట్లు శుక్రవారం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన పుట్ట గంగరాం తన కొడుకు పుట్ట సురేష్‌తో కలిసి పశువులను మేపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పశువులను మేపుకుంటూ మండలంలోని వాల్గొండ గంగ సమీపానికి వచ్చారు. అక్కడ ప్రమాదవశాత్తు గంగారాం నీట మునిగి మృతి చెందినట్లు తెలిపారు. గంగారాం కొడుకు సురేష్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలం పరిశీలించి కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ సంచాలకులు చత్రునాయక్

ఇల్లందకుంట, మార్చి 22: రైతులు తమ వ్యవసాయ పనుల్లో అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయ శాఖ సంచాలకులు చత్రునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని సిరిసేడు గ్రామంలోని రైతు వేదికలో మండల వ్యవసాయాధికారిని గుర్రం రజిత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చత్రునాయక్ మాట్లాడారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి పైరుకు అగ్గి తెగులు, మెడ విరుపు తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. అగ్గి తెగులు నివారణకు ట్రై సైక్లోజోల్ 0.6 గ్రాములు, మాస్కోజెబ్ 2.5 గ్రాములు ఐసోప్రోతయోలెన్ 2.5 గ్రాములు నీటిలో కలుపుకొని తెగులు ఉధృతిని బట్టీ 10నుంచి 15రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలన్నారు. అదేవిధంగా పాముపొడ తెగులు గమనించినట్లయితే హైక్సెకెనజోల్ 2ఎంఎల్, వాలిడామైసిన్ 2ఎంఎల్, ప్రొపికొనిజోల్ 1ఎంఎల్ లీటర్ నీటికి కలిపి 15రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. కాండం కుళ్లు తెగులు గమనించినట్లయితే హెక్సాకోనజోల్ 2ఎంఎల్, వాలిడామైసిన్ 2ఎంఎల్, కార్బండెజమ్ 1 గ్రాము 15 రోజుల్లో రెండుసార్లు స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో మమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వింద్యావ్యాలీ విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంత్

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 22: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింద్యావ్యాలీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులను సాధించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫిజిక్స్ ఫోరం, జూవాలజీ ఫోరంలు కరీంనగర్‌లోని ఫిల్మ్‌భవన్‌లో నిర్వహించిన పిచ్చుకల దినోత్సవ పోటీల్లో పిచ్చుకల పెంపకం, ఫీడింగ్ విభాగంలో పాఠశాల విద్యార్థి ఎండి షౌకత్‌అలీ ప్రథమ స్థానాన్ని, అంజుమ్ ఫారియా ద్వితీయ స్థానాన్ని సాధించారు. అలాగే పిచ్చుకల గూళ్ళ నిర్మాణం విభాగంలో విద్యార్థులు సిహెచ్ లాస్య, ప్రథమ స్థానాన్ని, టీ పూజిత ద్వితీయ స్థానాన్ని సాధించి జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఈవో సిహెచ్ జనర్దాన్‌రావు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల చైర్మెన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మెన్ ఆర్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి ప్రశాంత్ వారికి బహుమతులను, ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు.

అక్షయ మహిళా డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ సంబరాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్, మార్చి 22: నగరంలోని అక్షయ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్‌పార్టీ సంబరాలు ఘనంగా జరిగాయి. అక్షయ మహిళా డిగ్రీ కళాశాలకరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఉన్నత విద్య కోసం ప్రణాళికలు రచించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులుచేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి శైలజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అభివృద్ధిని కాంక్షించి ఆశీర్వదించండి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బి వినోద్‌కుమార్



వాకర్స్‌తో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, మార్చి 22: అభివృద్ధిని కాంక్షించేవారు తనను ఆశీర్వదించి ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు, ఇతర నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించి, వాకర్స్ క్రీడాకారులతో కొద్దిసేపు ముచ్చటించారు. క్రికెట్ ఆడుతూ సందండి చేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఆపదలో అండగా ఉంటానని, ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానని, ఒక్కసారి ఆలోచించి తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు పొన్నం అనిల్‌కుమార్, కార్పొరేటర్ బండారి వేణు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని రద్దుచేయాలి

భగత్‌నగర్, మార్చి 22: నూతన విద్యావిధానాన్ని రద్దుచేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవా రం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో కరపత్రాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యావిధానాన్ని రద్దుచేసి కరీంనగర్‌ను విద్యాహబ్‌గా మార్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, వినయ్, నితిన్, అనిల్, కల్యాణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మానకొండూర్, మార్చి 22: మండలంలోని అన్నారం గ్రామంలో తాగునీటి సరఫరా పునరుద్ధరణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. తాగునీటికి కటకట పేరిట 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో మండల పంచాయతీ అధికారి రాజేశ్వర్‌రావు స్పందించి గ్రామస్థులకు తాగునీటిని సరఫరా చేశారు. అనంతరం గ్రామ సభ నిర్వహించి వేసవిలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పైప్‌లైన్ పగిలిపోవడం, లీకేజీ లాంటి సమస్యలు తలెత్తితే ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రావు పాల్గొన్నారు.

తపాలాశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

హుజూరాబాద్, మార్చి 22: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న తపాలా శాఖలోని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హుజూరాబాద్ తపాలా శాఖ పోస్టుమాస్టర్ ఊకంటి మహేందర్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ సబ్ జైలులో తపాలా శాఖ ఆధ్వర్యంలో జైలు అధికారులకు, ఖైదీలకు బీమా పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అమర్‌నాథ్ రెడ్డి, గణేష్, సంపత్, హరీష్, రాజేష్, శివాజీ, సత్యం, స్వామి పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



సీమంతానికి హాజరైన గర్భిణులు

హుజూరాబాద్, మార్చి 22: హుజూరాబాద్ పట్టణం పోచమ్మవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీడీపీవో తిరుమల పాల్గొని గర్భిణులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే మేలుపై అవకగాహన కల్పించారు. కార్యక్రమంలో జయ, జ్యోతిరాణి, సబిత, సుకన్య, అరుణ, పద్మ, సంధ్య, ఫాతిమ, సులోచన, తిరుపతమ్మ, రచిత తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని వెల్దిలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలు అంగన్ వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో సబిత, ఏసీడీపీవో అరవింద, సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఇల్లందకుంట, మార్చి 22: ఇల్లందకుంట మండలంలోని చిన్నకోమటిపల్లి గ్రామంలోని శ్రీస్వయంభూ నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ముగిశాయి. శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు తెల్లవర్తుల ప్రదీప్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, నిత్యవిధి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం గుట్ట చుట్టూ బండ్లు (తిరుగుట) ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్ల సరోజన-నాగన్న, రవి, వేణు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుల అంజన్‌కుమార్

కరీంనగర్ అర్బన్, మార్చి 22: ఎంపీ బండి సంజయ్‌కుమార్ తన ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని యువజన కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ మైనింగ్ మాఫియాలో ఈడీ విచారణను ఎదుర్కొన్నప్పటికీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎంపీగా బండి సంజయ్ మైనింగ్ మాఫియాలో జరిగిన అవకతవకలపై నిజానిజాలు ప్రజలకు ఎందుకు తెలియజేయలేదన్నారు. ఈ వ్యవహారంలో మంత్రి గంగుల నుంచి పెద్ద మొత్తంలో బండి సంజయ్‌కు ముడుపులు అందాయని వస్తున్న ఆరోపణలను ఎందుకు ఖండించలేదన్నారు. కార్పొరేటర్ స్థాయి నుంచి ఎంపీగా ఎదిగిన బండి సంజయ్‌కు వేల కోట్ల రూపాయలు ఎలా వచ్చాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్ మరోసారి గెలుపొందనున్నారని బీజేపీ శ్రేణులు భ్రమ పడుతున్నారన్నారు. ఐదు సంవత్సరాల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం తప్ప చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అభివృద్ధి చేయని బండి సంజయ్‌కి ఓటు వేయడానికి ప్రజలు సిద్ధంగా లేరనే విషయాన్ని బీజేపీ శ్రేణులు గుర్తించాలన్నారు. బీజేపీ నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. గతంలో కరీంనగర్ ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నుంచి తిరుపతి రైలు, మాతా శిశు సంరక్షణ కేంద్రం, పాస్‌పోర్ట్ కేంద్రం, నియోజకవర్గ స్థాయిలో కేంద్రీయ విద్యాలయాలు, బీడీ కార్మికుల ఆసుపత్రి, ఎఫ్ఎం రేడియో స్టేషన్, మోడల్ స్కూల్, సైనిక్ స్కూల్, స్పోర్ట్స్ స్కూల్ లాంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. చేసిన అభివృద్ధిపై టవర్ సర్కిల్ వద్ద బహిరంగ చర్చకు రావాలన్నారు. సమావేశంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, డీసీసీ కార్యదర్శి రోశ్య సతీష్, మాజీ అధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ అమీర్, యూత్ కాంగ్రెస్ నాయకులు అరుణ్ కుమార్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మధుసూదన్‌రెడ్డికి అభినందన సభ

కరీంనగర్ కల్చరల్, మార్చి 22: ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారాన్ని అందుకున్న కాలమిస్టు, రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డికి శుక్రవారం ఫిలింభవన్‌లో తెలంగాణ తెలుగు భాషా పరిరక్షన సంఘం, శాతవాహన లయన్స్ క్లబ్, జిల్లా సైక్లింగ్ అసోసియే షన్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ మాట్లాడుతూ సమాజహిత కార్యక్రమాలు చేపడుతూ మరోవైపు సంపాదకీయ వ్యాసాలు రాస్తున్న మధుసూదన్‌రెడ్డికి పురస్కారం దక్కడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వారాల ఆనంద్, కోట మురళి, డాక్టర్ రామకృష్ణ, బొమ్మ కంటి కిషన్, ఎస్ వేణుగోపాల్, జి కృపాదానం, గాజుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ఎల్ఐసీ

భగత్‌నగర్, మార్చి 22: దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీ సామాజిక సేవలో ముందుంటుందని ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం జగన్నాథ్ అన్నారు. గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ కార్యక్రమంలో భాగంగా డివిజనల్ కార్యాలయంలో రేకుర్తి కంటి ఆసుపత్రికి 25 లక్షల విలువైన బస్సును శుక్రవారం అందజేశారు. అనంతరం ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఎలొకె శ్యాం సుందర్, సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రసాద్‌రావు, రేకుర్తి ఆసుపత్రి చైర్మన్ లయన్ కొండ వేణుమూర్తి, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

కరీంనగర్ టౌన్, మార్చి 22: రోటరీ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు గొరిట్యాల వెంకటకిషన్ తెలిపారు. శుక్రవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వెంకటకిషన్, ప్రధాన కార్యదర్శి పాక పావనకృష్ణ మాట్లాడారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ సంయుక్తంగా వెల్గన్ సంస్థ సహకారంతో గ్రామంలో చదువుకొనే పేద విద్యార్థులను గుర్తించి సైకిళ్లను అందజేశామన్నారు. ఇందుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ సిహెచ్ జయప్రద ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చిగురుమామిడి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, రోటేరియన్ సభ్యులు పాల్గొన్నారు.

శాలివాహనుని విగ్రహం ప్రతిష్ఠించాలి

గణేశ్‌నగర్, మార్చి 22: భారత జాతీయ శక పురుషుడు శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని కరీంనగర్‌లో ప్రతిష్ఠించాలని జిల్లా కుమ్మరి సంఘం అధ్యక్షుడు నార్లపురం చంద్రమౌళి అన్నారు. శుక్రవారం నగరంలోని సంఘ భవనంలో శాలివాహన చక్రవర్తి జయంతి ఉత్సవాన్ని కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నార్లాపురం చంద్రమౌళి, అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ శాలివాహన విగ్రహాన్ని అలుగునూరు బ్రిడ్జి లేదా లోయర్ మానేరు డ్యాం ఆనకట్టపై గానీ నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు జి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, గట్టయ్య, నారాయణ, లక్ష్మీరాజం, రవి, పాల్గొన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

కరీంనగర్ లీగల్, మార్చి 22: కరీంనగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 28న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి కాసుగంటి మాధవరావు తెలిపారు. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీల్లో ఉండే అభ్యర్థుల జాబితాను ఆయన ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్ష పదవికి లింగంపల్లి నాగరాజు, లెంకల రాజిరెడ్డి, పూరెల్ల రాములు, జూపల్లి సత్యనారాయణ రావు, పీవీ రాజ్‌కుమార్ పోటీపడుతున్నారు. ఉపాధ్యక్ష పదవికి తిరుకోలా రఘువీర్, వేముల శ్రీనివాస్ పటేల్, పెంచాల శ్రీనివాస్‌రావు, సయ్యద్ సాబిర్, ప్రధాన కార్యదర్శి పదవికి చెల్లోజు భూమాచారి, మహేందర్‌రెడ్డి, చాత రాజు ప్రదీప్‌కుమార్‌రాజు పోటీలో ఉన్నారు. సెక్రెటరీగా గుగులోతు బీమా, నరేంద్ర, ప్రసాద్, సిరికొండ శ్రీదర్‌రావు, పెరిక శ్రీనివాస్, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శి కటకం రాజేందర్, కోమటిరెడ్డి తేజ్‌దీప్‌రెడ్డి బరిలో ఉన్నారు. సీనియర్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ మూడు పోస్టులకు వెన్న ఆనందం, కందుల అరుణ్‌కుమార్, సుంకె దేవకిషన్, సాదినేని ప్రభాకర్, పెరుక రంగయ్య, మాతంగి రవీందర్, బండ శివకుమార్, జూనియర్ సభ్యుల పదవికి పాస్తం అంజనేయులు, గూడా హరికృష్ణ, కొండ్ర లక్ష్మయ్య, కోల ప్రభాకర్, బెజ్జంకి శ్రీకాంత్, బెజ్జంకి శ్రీనివాస్ బరిలో ఉన్నారు. మహిళా ప్రతినిధిగా మొర్రి హేమలత పటేల్, డి రేణుక పోటీ పడుతున్నారు. కోశాధికారిగా రామగిరి శ్రీనివాస్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా మడిపల్లి రవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మాధవరావు తెలిపారు. ఎన్నికల్లో 1030 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉండగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామన్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని అన్నారు.

● **హుజూరాబాద్ లీగల్:** హుజూరాబాద్ న్యాయవాదుల సంఘానికి ఈ నెల 28న ఎన్నికలు జరగనున్నట్లు ఎన్నికలాధికారులు కె భగవాన్‌రెడ్డి, సీకే జేమ్స్, ఎన్ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత అధ్యక్ష పదవికి గోస్కుల శ్రీనివాస్, యతిపతి అరుణ్‌కుమార్, ఉపాధ్యక్ష పదవికి బోనగిరి కుమారస్వామి, బండి రమేష్, ప్రధాన కార్యదర్శి పదవికి ఎర్రోళ్ల రమేష్, మట్టెల తిరుపతి, కోశాధికారి పదవికి సీహెచ్ భానుకిరణ్, ఎం దివ్య, లైబ్రేరియన్ పదవికి బత్తుల తిరుపతి, అప్పని రాజు, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా అందె వెంకటేశ్వరరావు, పి లింగారెడ్డి పోటీల్లో ఉన్నట్లు వారు పేర్కొన్నారు. కాగా సహాయ కార్యదర్శిగా పి జ్యోత్స్నదేవి, స్పోర్ట్స్ అండ్ కల్చరర్ సెక్రెటరీగా కల్వల సౌమిత్ర, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కె సరిత, మహిళా సభ్యురాలుగా ముశం మౌనిక ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికలాధికారులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సముద్రాల అజయ్

సుభాష్‌నగర్, మార్చి 22: కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ కోరారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. రాష్ట్రంలో జనాభా ప్రకారం మాలల కన్నా మాదిగలే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీట్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం చేస్తోందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధి లో మొదటి నుంచి కేవలం గడ్డం వెంకటస్వామి కుటుంబమే మూడు తరాలుగా రాజకీయ లబ్ధి పొందుతోందన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజా సంఘాల రాష్ట్ర చైర్మన్ గజ్జల కాంతంకు పెద్దపల్లి టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావే శంలో సంఘం రాష్ట్ర ప్లానింగ్ కమిటి చైర్మెన్ గజ్జెల ఆనందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల లక్ష్మణ్, మహిళ జిల్లా అధ్యక్షురాలు కొండ్ర స్వరూప, కాసారపు కిరణ్, కన్నం లక్ష్మణ్, కల్వల ఆనంద్, మీసాల సాయిలు, చామనపల్లి చంద్రశేఖర్, గండి గణేశ్, మామిడిపల్లి, ఆర్ శ్యామల కృష్ణ పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ధ్యేయం

- పంట రుణాలు సద్వినియోగం చేసుకోవాలి
- సభ్యులకు బోనస్ అందించేందుకు చర్యలు
- సహకార సంఘం అధ్యక్షుడు తిరుమల్‌రావు



కురిక్యాలలో మాట్లాడుతున్న పీఏసీఎస్ అధ్యక్షుడు తిరుమల్‌రావు

గంగాధర, మార్చి 22: రైతుల శ్రేయస్సే ధ్యేయంగా సహకార సంఘాలు పని చేస్తున్నాయని కురిక్యాల పీఏసీఎస్ అధ్యక్షుడు వెలిచాల తిరుమల్‌రావు అన్నారు. శుక్రవారం కురిక్యాలలో పీఏసీఎస్ డైరెక్టర్లు, సంఘ సభ్యులు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘంలో జమ, ఖర్చులు, నిధుల వివరాలను వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారాతీసుకున్న 386 మంది రైతులకు 2.22కోట్ల రుణమాఫీ, 2023-24 సంవత్సరానికి పంట రుణాలు 54.90 లక్షలు, దీర్ఘకాలిక రుణాలు 1.15కోట్లు అందించినట్లు తెలిపారు. ఈసందర్భంగా రైతులకు బోనస్ అందించేలా సంఘం కృషి చేయడంతో పాటు సాగునీరందించేలా చూడాలని మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు,మాజీ ఎంపీపీ కిషన్, మాజీ సర్పంచ్‌లు దామోదర్, నవీన్‌రావు, సీఈవో ప్రభాకర్ రైతులు పాల్గొన్నారు.

● సభ్యులకు పది శాతం డివిడెండ్

చొప్పదండి: సంఘ సభ్యులకు లాభాలలో పది శాతం డివిడెండ్‌ను ఇవ్వన్నుట్లు చొప్పదండి ప్రాథమిక సహకార సంఘం చైర్మెన్ వెల్మ మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం సంఘం 73వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంఘం కోటి 57లక్షల రూపాయల నికర లాభాన్ని ఆర్జించిందన్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేసిన సభ్యులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ముద్దం మల్లేశం,సీఈఓ కళ్ళెం తిరుపతిరెడ్డి. డైరెక్టర్లు మాజీ అధ్యక్షులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, గుంటి మల్లయ్య, పాల్గొన్నారు.

● సహకార సంఘం అభివృద్ధికి కృషి

శంకరపట్నం: మెట్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాసభను చింతలపల్లిలో చైర్మన్ సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆదాయ వ్యయాలను సీఈవో శనిగరపు సదయ్య చదివి వినిపించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు అంతం రవీందర్‌రెడ్డి, బోనగిరి అయిలయ్య, కాల్వ వెంకటరమణారెడ్డి, రాజిరెడ్డి, రవి, బోడ సుధాకర్, కవ్వ పద్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సుడా చైర్మన్‌ను కలిసిన నాయకులు

తిమ్మాపూర్, మార్చి22: సుడా చైర్మన్‌గా నియమితులైనా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాల్వ మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఆస్తి పన్ను వసూలు చేయాలి

జమ్మికుంట, మార్చి 22: జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, నల్ల పన్నుల వసూళ్ల ఈ నెల 31వ తేదీ వరకు 100శాతం వసూళ్ల చేయాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ అయాజ్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ఇప్పటి వరకు 84శాతం వసూల్లు పూర్తి అయ్యాయని, మిగిలిన మొత్తం త్వరగా పూర్తి చేయాలన్నారు. అన్ని మున్సిపాలిటీలతో పోలిస్తే జమ్మికుంట మున్సిపాలిటీ ముందుండాలని, అలా ముందుండాలంటే దానికి పూర్తిగా మీరు వసూళ్ల చేసే పన్నుల ద్వారానే సాధ్యపడుతుందన్నారు. ఈ నెల 31వరకు ఉన్న 90శాతం రిబేట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఇంటి పన్నులు, నల్ల పన్నులు, ట్రేడ్ లైసెన్స్ చెల్లించాలని ప్రజలకు సూచించారు. సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మహేష్‌తో పాటు వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్ని పార్టీలకు పరీక్షగా గన్నేరువరం బ్రిడ్జి హామీ

- గత ఎంపీ ఎన్నికల్లో అన్ని పార్టీల అభయం - బ్రిడ్జి సాధన సమితి పేరుతో ప్రజల పోరాటం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బ్రిడ్జి జేఏసీ నిరసన(ఫైల్)

గన్నేరువరం, మార్చి 22: గన్నేరువరం నుంచి లోయర్ మానేరు డ్యాం మీదుగా కరీంనగర్‌కు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండల ప్రజలు కోరుతున్నారు. కరీంనగర్‌కు 40 కిలోమీటర్ల దూర ప్రయాణం తగ్గుతుందని పేర్కొంటున్నా రు. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ గన్నేరువరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కరీంనగర్ నుంచి లోయర్ మానేరు డ్యాంపై గన్నేరువరం బ్రిడ్జి నిర్మిస్తానని ఇచ్చిన హామీ నీటి మూటగానే మారింది. మళ్లీ ఎంపీ ఎన్నికలు సమీపిస్తుండటంతో బ్రిడ్జి నిర్మాణంపై చర్చ నడుస్తోంది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ మండల ప్రజలు, యువజన సంఘాలు కలిసి బ్రిడ్జి సాధన సమితి(జేఏసి)ని ఏర్పాటు చేసుకుని డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపి బండి సంజయ్‌కు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కు, అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లను కలిసి వినతిపత్రాలను అందజేశారు. గన్నేరువరం మండలంలోని మైలారం మైసమ్మగుట్ట నుంచి బ్రిడ్జి నిర్మాణం చేపడితే కరీంనగర్‌కు 7కిలోమీటర్ల దూరం, చొక్కారావుపల్లి నుండి చేపడితే 12కిలోమీటర్ల దూరంలో చేరుకోవచ్చని బ్రిడ్జి జేఏసీ నాయకులు పేర్కొంటున్నారు. మైసమ్మగుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. బ్రిడ్జిని నిర్మిస్తే కరీంనగర్‌కు చేరుకోవడానికి గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండల ప్రజలకు విద్య, వైద్యానికి దూరభారం తగ్గి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కోరుతున్నారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

వీణవంక, మార్చి 22: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన గుర్రం రాజు (30) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుకు ఐదు సంవత్సరాల క్రితం వివాహం అయింది. గ్రామంలో అద్దె ఇంట్లో కాపురం ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం కుటుంబ కలహాలతో భార్య తన పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి రాజు ఒంటరిగా ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి దుర్వాసన వస్తుందని పక్కన ఉన్నావారు రాజు కుటుంబ సభ్యులకు సమాచారం అందిచారు. వారు తలుపులు తీసి ఇంట్లో చూడగా ఇంట్లో ఉరివేసుకొని కనిపించాడు. రాజు ఆత్మహత్యకు కుటుంబ కలహాలేనా లేక వేరే ఇతర కారణాలు ఉన్నాయా తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థులకు ర్యాంకులు



విద్యార్థులతో 'అల్ఫోర్స్' చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్, మార్చి 22: అల్ఫోర్స్ ఇ-టెక్నో విద్యార్థులు జాతీయస్థాయి మాథ్స్ సైన్స్ ఒలింపియాడ్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. శుక్రవారం కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమికస్థాయి నుంచే వివిధ దశల్లో ప్రోత్సాహాన్ని అందిస్తు గణిత శాస్త్రంపై అవగాహన పెంచుతున్నామన్నారు. పోటీల్లో పరీక్షల్లో ఒఎంఎస్ అకాడమీ నిర్వహించిన జాతీయస్థాయి మాథ్స్ ఒలింపియాడ్‌లో పాఠశాలకు చెందిన మయాంక్‌రెడ్డి, విహాన్‌కృష్ణ, రహమాన్, ఆరాధ్య, క్రిషిక్ ప్రిన్స్ అత్యుత్తమ ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ రూరల్, మార్చి 22: రాష్ట్రస్థాయి మేనేజ్‌మెంట్ పోటీల్లో ఎస్ఆర్ఎం విద్యార్థులు ప్రతిభ చాటారు. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన ఆరోహణ-2024 పోటీల్లో కళాశాల ఎంబీఏ విద్యార్థులు పి దేవరాజ్, కె ఆదర్శ్ జె అమృత ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎం తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ సి వెంకటేశ్వర్‌రావు అభినందించారు.

మంచినీటి సరఫరాపై సమీక్ష

కరీంనగర్ రూరల్, మార్చి 22: కొత్తపల్లి మండలం చింతకుంటలో మంచినీటి సరఫరా చేయడానికి గాను మిషన్ భగీరథ అధికారులు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలో మంచినీటికి ఇబ్బందులు లేకుండా మంచినీటి సరఫరా చేయాలని గ్రామంలోని ఆపరేటర్లు, వాటర్‌సప్లై లైన్‌మెన్‌లకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమలో ఎంపిటీసీ తిరుపతినాయక్, అధికారులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

కరీంనగర్ స్పోర్ట్స్: హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేద క్రీడాకారుడు ఎం వినయ్‌కుమార్‌కు శుక్రవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో బిఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న అతనికి సంస్థ సంయక్త కార్యద ర్శి గోగూరి శ్రీధర్‌రెడ్డి రూ. 5000ల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. అలాగే ప్రతినెల అతనికి సంస్థ ఆధ్వర్యంలో రూ. 500చొప్పున సహాయాన్ని అందించనున్నామని సంస్థ వ్యవస్థాక అధ్యక్షుడు ధనపురి సాగర్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివా స్, శాతవాహన యూనివర్సిటీ రిటైర్డ్ పీడీ బి రామేశ్వ ర్‌రావు, కళాశాల పీడీ పన్యాల శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: మేముసైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు, సామూహిక అక్షర భ్యాసాల కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం అంగన్ వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాలకు ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు చికల స్వప్న, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిలో ప్రతి శనివారం నిర్వహించాల్సిన గొర్రెలు, మేకల వార సంత వేలం ఎన్నికల కోడ్ వల్ల వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల తర్వాత వేలాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

గంగాధర: మండలంలలోని కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వాలీబాల్ పోటీలను నిర్వహించి గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేశారు.

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యర్థినులు జే రచన, అలైఖ్య, ఎండీ అఫ్రసుల్తానా, జి శాన్వి, పి అక్షితలకు రోటరి క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గొరిట్యాల లక్ష్మణ్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, క్లబ్‌కార్యదర్శి పవన్ కృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు జయప్రద పాల్గొన్నారు.

- మండలంలోని ఇందుర్తి, చిన్నముల్కనూర్, ఉల్లంపల్లి, రేకొండ, బొమ్మనపల్లి, సుందరగిరి, నవాబుపేట ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయలు కోల రాంచంద్రరెడ్డి జయప్రద, ఒదేలు, సత్యం, శేఖర్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: ఉపాధిహామీ కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కె సృజన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామడుగులో కూలీలు పని చేస్తున్న ప్రదేశాన్ని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజేశం, మల్లేశం, కనుకయ్య, ఐలయ్య, రాజవ్వ, విజయ, లక్ష్మీ, లలిత, మాధవి, జ్యోతి, శోభారాణి పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు లక్ష్యం కోసం శ్రమించాలని మాజీ ఎమ్మెల్యే సతీష్‌బాబు అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృ తిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమకుమార్ తది తరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని 19వ వార్డులో గోస్కుల సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ 50కేజీల బియ్యాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సొల్లు సునీత, గాలిబ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెగా క్యాంప్ నిర్వహించి 110 మందికి జీరో బ్యాలెన్స్ అకౌంట్ ఓపెన్ చేశామని బ్యాంక్ మేనేజర్ దొరస్వామినాయక్ తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నీతిష్ పాల్గొన్నారు.